కథ

# మేరా బాప్ ఖియ్యూం!

హుమాయూన్ సంఘీర్
94411 17051



ఫజర్

నమాజ్ అజాం మైకుల్లో వినిపిస్తున్నది. నల్గొండలోని ఘడియాల్ చౌరస్తాలో ముప్పై ఏళ్ల ఖలీల్.. కోల్పోయిన తన అస్తిత్వం కోసం నిరసనకు కూర్చున్నాడు. అతని వెనకాల.. 'మా అమ్మీకి న్యాయం కావాలి'; 'మేరా వతన్ నల్గొండ అని ఎలుగెత్తి చాటాలి'; 'సాంప్రదాయిక దుర్మార్గం నశించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు ఉన్నాయి.

అప్పుడప్పుడే ఆటోవాలాలు, వ్యాపారులు, నమాజుకు, వాకింగ్‌కు, జిమ్‌కు వెళ్తూ.. ఖలీల్‌ను చూసి, దగ్గరికి వచ్చి ఆరాలు తీస్తున్నారు. అతని పక్కనున్న మిత్రుడు సంతోష్ వాళ్లకు సమాధానం చెబుతున్నాడు.

"ఘరేలు మస్లా హైతో చారోమే బైఠ్కే బాత్ కర్లేనా.. మగర్ యే క్యా తరీఖా?" అంటూ.. కొందరు ముక్కువిరుస్తూ గబగబా నమాజుకు వెళ్తున్నారు.

"ఉన్కో అల్లా కభీ మాఫ్ నహీం కరేగా".. సైకిల్ మీదున్న ఓ తెల్లగడ్డం పెద్దాయన విస్తుబోయాడు.

"అయ్యో.. ఇంత అన్యాయమా? మనుషులేనా వాళ్లు? నీకు అండగా మేముంటం బ్రదర్!" అంటూ ఖలీల్ భుజం చరిచాడు మానవ హక్కుల ఉద్యమనేత శంకర్. ఆయన మాట ఖలీల్‌కు నిట్టాడంత ఆదెరువిచ్చింది.

నిరసన తెలుపుతున్న ఖలీల్ కళ్లు ఎర్ర గోర్జాల్లా ఉన్నాయి. ముప్పై ఏళ్ల క్రితం తన తల్లికి జరిగిన అన్యాయం తాలూకు గతమంతా నిక్షిప్తమై, న్యాయం కోసం ఎదురు చూసీచూసీ అలసిపోయినట్టుగా కూడా ఉన్నాయి.

ఏ న్యాయశాస్త్రంతో అన్యాయం జరిగిందో దాంతోనే న్యాయం పొందాలని పట్టుదలగా వచ్చాడు.

అలా కొయ్యబొమ్మలా శూన్యంలోకి చూస్తున్న అతని దృష్టి.. ఘడియాల్ చౌరస్తా నుంచి దక్షిణం వైపు కనిపిస్తున్న ఫీల్‌ఖానా వైపు మళ్లింది. ఆ ఫీల్‌ఖానా.. తనకెప్పటినుంచో ఫీలింగ్స్ అన్నీ బందీ అయిన ఖానాలా కనిపిస్తుంది!

ఖలీల్‌ది నిజామాబాద్ జిల్లా గోపాల్‌పేట్ గ్రామం. నిన్నే నల్గొండకు వచ్చాడు.

'ఇన్నేండ్లల్ల జరగని న్యాయం ఇప్పుడు జరుగుతదని అనుకుంటున్నవా? మనం ఎప్పుడన్న మాట మర్యాదకు నల్గొండకు పోతే కుక్కలను ఎలగొట్టినట్టు ఎలగొట్టిర్రు. అత్తమ్మకు, మీకు జరిగిన అవమానాలు సాలయా? వాళ్లు తేమలేని రాళ్లే! వాళ్లల్ల ఆ గురాతనం ఎప్పటికీ రాదు. పైసకోసం పియ్యి తినే మన్నులు. నా మాట ఇని రేషం మానుకో. వాళ్లతాన పైస ఉంది, పరపతి ఉంది. అంతకుమించిన దిన్వాలాలు వాళ్లు. మనం వాళ్లతోని ఎన్లగూడ పోటీవడలేం. మన రాత గింతే అనుకోరాదు. మనకిద్దరు పిల్లలున్నరు. ఇంత ఎవుసం, టైలర్ దుకాణం ఉంది. గదే మనకు ప్రాప్తం అనుకో. ఇప్పుడు వోయి నువ్వాడ పోరాటం జేసినా ఏం కాదే. మిమ్ములను ఎన్నో అరిగోసలు వెట్టిన వాళ్లు ఎన్ని హజ్‌యాత్రలు చేసచ్చినా.. దోజఖ్‌కే పోతరు' అన్న భార్య సమీనా మాటలు తన చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉన్నాయి.

అయినా ఏదో ఆశ, గత ముప్పై ఏళ్లుగా తన మదిలో లార్వాలా మసలుతున్న సంకల్పం అది. అస్తిత్వం కోసం, న్యాయం కోసం సుదీర్ఘంగా అమ్మ ఎదురు చూసీచూసీ.. అలసిపోయి తనువు చాలించిన రాచపుండులాంటి సలపరం అది.

రెక్కల కష్టాన్ని తప్పితే దేన్నీ నమ్ముకోని ఆ తల్లికి అన్యాయం ఎట్లా జరుగుతది? ఆ తల్లి పిల్లలమైన తమ పక్షంగా న్యాయం నిలవాల్సిందే! న్యాయదేవతకు స్త్రీ రూపమే కదా!? అట్లాంటి సాటి స్త్రీకి ఇంత అన్యాయం జరిగినంక ఎట్లా ఊకుంటది?

ఇన్నేసి ప్రశ్నలు బట్టీమీద కడాయిలో బెల్లం పాకంలా అతని అంతరాన్ని కుతకుతా ఉడికిస్తున్నాయి.

నాన్నను తలుచుకొని అమ్మ ఆకాశానికి ముఖం పెట్టుకొని గొడోమని ఏడ్చిన ఆ సందర్భాలను, కాయకష్టం చేసి బొబ్బలెక్కిన అరచేతులు, చెప్పుల్లేక నడిచి కాయలు కాసిన ఆ కాళ్లు, దూదిలాంటి మెత్తటి అమ్మ మనసును ఎన్నోసార్లు కత్తిగాట్లకు గురిచేసిన ఆ దుస్సంప్రదాయపు పైశాచికత్వం.. అన్నిటికీ ఇవాళ సమాధానం చెప్పాలనుకుంటున్న అతని మనసు నిండా మొక్కవోని ఆత్మవిశ్వాసం.

తెల్లారింది. వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. అప్పుడే ఈవార్త నల్గొండ అంతా పాకిపోయింది. జనాలు అక్కడికి హోరెత్తడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ఇంతలో..

"ఏందయ్యా.. ఏ ఊరు నీది? ఏంటి ఈ న్యూసెన్స్?" అక్కడికొచ్చిన సీఐ రవి ప్రశ్నించాడు.

"న్యాయం కావాలి సార్.." అంటూ, తన వద్ద ఉన్న అమ్మానాన్నల పెళ్లినాటి నిఖానామా ఎరుపురంగు పుస్తకాలు, కోర్టులో అమ్మ కేసు వేసిన కాగితాలను చూపించాడు.

"నువ్వు వెంటనే లాయర్‌ను కలవాలయ్యా. ఇది కరెక్ట్ కాదు" అన్నాడు సీఐ.

"సామాన్యుడికి నిరసన తప్పితే వేరే దారిలేదు సార్. మొండిగా మారిన న్యాయాలు, చట్టాలు నిరసనతోనైనా పదునెక్కుతాయనే నమ్మకంతో వచ్చిన సార్" నింపాదిగా అన్నాడు.

అప్పటికే ఎండ ఖణఖణలాడుతున్నది. టిఫిన్ కూడా చెయ్యలేదు. సంతోష్ తెచ్చిన ఇడ్లీల ప్యాకెట్ మీద ఈగలు వాలుతున్నాయి.

ఖలీల్ అనుకున్నట్టుగానే ఫీల్‌ఖానా నుంచి అతని నెంబర్‌కు కాల్స్ వస్తున్నాయి.

"మర్యాదగా ఎట్లా వచ్చినవో అట్లనే ఎల్లిపో! మానిన గాయాన్ని మల్ల గెల్కకు!" అంటూ గద్దిస్తున్నారు.

ఖలీల్ తన ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టేశాడు.

రెండోరోజు కూడా అతని నిరసన కొనసాగుతున్నదక్కడ. మహిళా మండలి సభ్యులు కూడా అతనికి